# ప్రజాశక్తి

సోమవారం 29 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం




పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి ఎదురీదుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోవడం, కీలక సమస్యలను ఎమ్మెల్యే పట్టించుకోక పోవడంతోపాటు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ అధికార వైసిపికి ప్రతికూలత కల్పించనుందా? అంటే రాజకీయ విశ్లేషకుల నోట ఔననే సమాధానం వినిపిస్తోంది. ఇలాంటి వైసిపి వ్యతిరేక ఓటును టిడిపి తమవైపు తిప్పకోగలుగుతుందా? లేదా వేచి చూడాల్సిందే. మరోవైపు ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన మోహనరావు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. సిపిఎం, సిపిఐ, ఇతర పార్టీలకు చెందిన ఓట్లతోపాటు అధికార ప్రతిపక్షాలను వ్యతిరేకించేవారు కూడా కాంగ్రెస్ అభ్యర్థిని బలపరుస్తున్నారు.

# పార్వతీపురంలో వైసిపికి ఎదురుగాలి

- హామీలు, కీలక సమస్యలు పరిష్కరించని ఎమ్మెల్యే
- వ్యతిరేక ఓటును టిడిపి వశపర్చుకునేనా?
- ఇండియా వేదిక అభ్యర్థిగా మోహనరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐదేళ్లపాటు వన్‌మెన్ షోగా ఒక వెలుగు వెలిగిన స్థానిక ఎమ్మెల్యేపై నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లోనూ వ్యతిరేకత పెరుగుతోంది. గడిచిన ఐదేళ్లలో ఆక్రమణలు, అక్రమాలు జబర్దస్తీగా సాగాయన్నది ప్రజల్లో జరుగుతున్న చర్చ. నియోజకవర్గం వ్యాప్తంగా బిసిలను పక్కనబెట్టి రాజకీయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారనే చర్చ కూడా నడుస్తోంది. అక్కడక్కడా తారు, బిటి రోడ్ల నిర్మాణం తప్ప అభివృద్ధి కూడా పెద్దగా జరిగింది లేదని జనం చర్చించుకుంటున్నారు. పార్టీలో ప్రశ్నించే సీనియర్ నాయకులను పక్కనబెట్టి, తనకు అనుకూలంగా తలూపే వారికి మాత్రమే పదవుల విషయంలో ప్రాధాన్యత ఇచ్చారని వైసిపి నాయకుల్లోనే చర్చ నడుస్తోంది.

ముఖ్యంగా పార్వతీపురం పట్టణంలో వివిధ సామాజికవర్గాల వారికి ఇళ్ల స్థలాల పేరిట పార్వతీపురం పట్టణంలోని కోదోడు బంద, నర్సిపురం పరిధిలో అక్కవానిబంద, దీవనబందలను కప్పేశారు. అందులో పరిమితంగా స్థలాలు పేదలకు పంచి, మిగిలనవీన్న బినామి పేర్లతో పార్టీ నేతలే నొక్కేశారని చర్చ బలంగా వినిపిస్తోంది.

దీనికితోడు మున్సిపాల్టీలో ఎమ్మెల్యే అన్నీ తానై వ్యవహరించినప్పటికీ పారిశుధ్య నిర్వహణ గురించి పట్టించుకోలేదు. ఇప్పటికీ పుట్టెడు దుర్గంధం నడుమ పట్టణవాసులు కాలం వెల్లదీస్తున్నారు. అభివృద్ధి, సదుపాయాల మాట అటుంచితే, పట్టణానికి వచ్చిన సిఎం జగన్ భద్రత పేరుతో ప్రధాన రహదారిలో ఏపుగా పెరిగిన పచ్చటి మొక్కలను రాత్రికి రాత్రి నరికేయడం పట్ల పట్టణ వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ముడుపులు చెల్లిస్తే తప్ప భవన నిర్మాణాలు, ఇతర అవసరాలకు మున్సిపాల్టీ నుంచి అనుమతులు రాని పరిస్థితి దాపురిస్తోంది. పార్వతీపురం పట్టణ పేదలకు సుమారు 12కిలో మీటర్ల దూరంలో నివాసానికి అనువుగాని చోట ఇవ్వడం, పట్టణానికి ఆనుకునివున్న లేఅవుట్లలో పేదల పట్టాలను రద్దుచేసి, అధికార పార్టీ అనుయాయులకు కట్టబెట్టేయడంతో నిజమైన లబ్ధిదారులు వైసిపిపై గుర్రుగా ఉన్నారు. బలిజిపేట మండలంలో ప్రశ్నించే సీనియర్ నాయకులను పక్కనబెట్టి, మెతకగా ఉన్న నాయకులకు మండలంలో అధికారం కట్టబెట్టి, ఆర్థిక వ్యవహారాలు చక్కబెట్టారనే వాదన బలంగా వినిపిస్తోంది.

ఇదే మండలంలోని బలిజిపేట, గలావల్లి, పెద్దింపేట, పెదపెంకి తదితర పెద్ద గ్రామాల్లోని యువత వైసిపిని వీడి జనసేన, టిడిపిలోకి వెళ్లింది. పార్వతీపురం - బొబ్బిలి మధ్యలో సీతానగరం సువర్ణముఖి నదిపైగల బ్రిడ్జి మరమ్మతులతో ప్రమాదకరంగా మారినా పుణ:నిర్మాణానికి ఎమ్మెల్యే కృషిచేయలేదు. జంఝావతి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఎలాగూ ముందుకు సాగలేదు. కనీసం కాలువలు (మిగతా.. 3లో)

## ప్రణాళికా బద్ధంగా

# రిసెప్షన్ సెంటర్లు

- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా, పక్కాగా ఉండాలని, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్ సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌంటర్ల ఏర్పాట్లు, విధులు, సదుపాయాలు, పార్కింగ్ తదితర అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లు పకడ్బంధీగా ఉండాలని ఆదేశించారు. సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చి, వారిని సిద్ధం చేయాలని సూచించారు. రోజంతా ఎంతో కష్టపడి ఎన్నికల విధులను నిర్వహించి, ఇవిఎం, ఇతర సామగ్రితో తిరిగి వచ్చే సిబ్బంది, ఎక్కడా ఇబ్బంది పడకుండా రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. పిఒలు, ఎపిఒలు, ఇతర సిబ్బంది బస్సులోనుంచి దిగగానే, తాము వెళ్లాల్సిన కౌంటర్లకు సులువుగా చేరుకొనే విధంగా డైరెక్షన్ బోర్డులు, నేమ్ బోర్డులు ఉండాలని అన్నారు. తాగునీరు, ఫుడ్ కౌంటర్లు, మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలను వివరిస్తూ పెద్ద సైజులో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో నియోజకవర్గానికి సుమారు 10 నుంచి 12 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడే ఇవిఎంలను, ముఖ్యమైన పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. సాధారణ కౌంటర్లలో ఇతర ఎన్నికల సామగ్రిని సమర్పించాలని చెప్పారు. స్పెషల్ కౌంటర్ లో నలుగురు సిబ్బంది, ఇద్దరు సహాయకులు, ఇవిఎంలను స్ట్రాంగురూములకు తరలించేందుకు మరో ఇద్దరు సహాయకులు ఉంటారని తెలిపారు. సాధారణ కౌంటర్‌లో ఇద్దరు సిబ్బంది, ఇద్దరు సహాయకులు, సామగ్రిని తరలించేందుకు మరోఇద్దరు సహాయకులు ఉంటారని వివరించారు.

మాట్లాడుతున్న ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ఒక్కో రిసెప్షన్ సెంటర్‌కు ఇద్దరు జిల్లా అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించామని కలెక్టర్ తెలిపారు. విజయనగరం, బొబ్బిలి అసెంబ్లీ స్థానాల ఓట్లు లెక్కింపు జరిగే జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం (మిగతా.. 3లో)

ఐఎంఎ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జాతీయ అధ్యక్షులు అశోకన్

# మందులపై జిఎస్‌టి తొలగించాలి

- ఐఎంఎ జాతీయ అధ్యక్షులు అశోకన్
- ఐఎంఎ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ లెక్కల ప్రకారమే దేశంలో వైద్య ఖర్చుల్లో 63శాతం ప్రజల జేబుల నుండే ఖర్చవుతున్నాయని, దీనివల్ల సరాసరి 5.5 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువకు చేరుతున్నారని ఐఎంఎ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్‌వి ఆశోకన్ అన్నారు. మందులపై 18 శాతం వరకు ఉన్న జిఎస్‌టిని తక్షణం తొలగించి ప్రజలకు ఆర్థిక వెసులుబాటును కల్పించాలని ఆయన (మిగతా.. 3లో)

# కార్మికులదే కీలకపాత్ర

- నెల్లిమర్ల నియోజకవర్గంలో 70 వేల ఓట్లు కార్మిక కుటుంబాలవే
- వల వేస్తున్న ప్రధాన పార్టీలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సార్వత్రిక ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విజయాన్ని నిర్ణయించేది కార్మికులే. నియోజకవర్గంలో 1,88,988 మంది ఓటర్లు ఉండగా ఇందులో సుమారుగా 60 వేల మంది కార్మిక కుటుంబాలకు చెందిన ఓట్లే ఉండడం గమనార్హం. నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాల్లో అత్యధికంగా ఓట్లు కార్మిక కుటుంబాలవే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు కార్మిక ఓట్లు కీలకం కానున్నాయి. నెల్లిమర్లలో జ్యూట్, సారిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులు సుమారుగా 4,500 మందికిపైగా ఉన్నారు. వారి కుటుంబాలతో కలుపుకుంటే సుమారుగా 12 వేల పైనే ఓట్లు లెక్కలోకి వస్తున్నాయి. పూసపాటిరేగ మండలం జిల్లాలోనే అతిపెద్ద ఇండస్ట్రీయల్ జోన్‌గా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. ఇక్కడ 10 పరిశ్రమల్లో సుమారు నాలుగు మండలాలకు సంబంధించి 18 వేల మంది కార్మికులతో పాటు వీరి కుటుంబాలతో సుమారుగా 30 వేల మంది కార్మిక ఓట్లు ఉన్నట్లు తెలుస్తుంది. దాంతో పాటు భోగాపురం, డెంకాడ మండలంలోని చిన్నా పెద్ద పరిశ్రమలు, కోళ్లపారాలు, రొయ్యలు హేచరీస్, టోల్‌గేట్ కార్మికులు, వారి కుటుంబాలు కలుపుకొని 10 వేల కార్మిక ఓట్లు ఉన్నట్లు అంచనా. అధికారికంగా ఈ ప్రాంతంలో సుమారుగా 20 వేల మంది కార్మికులు (మిగతా.. 3లో)

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

## ఎన్నికలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠరాజపురం, చినగుడిపాల గ్రామాలలో వల్లంపూడి ఎస్ఐ కె.రాజేష్ ఎన్నికలపై గ్రామస్తులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇంటి దగ్గర ఉండే పిల్లలు ఎన్నికల విధుల్లో పాల్గొంటే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నాయుడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి మేనిఫెస్టోలో అవే అబద్ధాలు

### టిడిపి బిసి సాధికార జిల్లా కన్వీనర్ కొల్లి

ప్రజాశక్తి- బాడంగి

ఎప్పుడు ఆడే అబద్ధాలనే జగన్ రెడ్డి మళ్లీ తమ మేనిఫెస్టోలో పొందిపరిచారని టిడిపి బిసి సాధికార జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలోలానే రెండు పేజీల మేనిఫెస్టోను ప్రకటించిన జగన్ కొత్తగా చెప్పుకోదగిన హామీలేవీ ఇవ్వలేదన్నారు. కేవలం రెండు మూడు పథకాల్లో ఇచ్చే నగదును స్వల్పంగా పెంచి మమ అనిపించారన్నారు. కీలకమైన పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన సహా ఉద్యోగులకు పిఆర్‌సి తదితర అంశాలపైనా మేనిఫెస్టోలో హామీ ఇవ్వలేదని విమర్శించారు. ఈ సారి ఎన్నికల్లో వైసిపిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

తనకు ఓటు వేయాలని కోరుతున్న కాంగ్రెస్ అభ్యర్థి విద్యాసాగర్

## ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని పోలవానివలస, ఐటిఐ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మరిపి విద్యాసాగర్ ఆదివారం ఇంటింటికీ వెళ్లి తనను గెలిపించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పిసిసి అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు, బొబ్బిలి మండల అధ్యక్షులు పత్రి రాజు, బాడంగి మండల అధ్యక్షులు రాజన్న అప్పలనాయుడు, రాంబద్రపురం మండల అధ్యక్షులు రాంబర్కి రామకృష్ణ, తెర్లాం మండల అధ్యక్షులు పొందూరు రవీంద్ర, కార్యకర్తలు ఈ శ్రీనివాస్, రాయి రామారావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల మధ్య చిచ్చు రేపిన వైసిపి

### ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు ఆర్‌జె ప్రకాశ్

ప్రజాశక్తి- విజయనగరం కోట

దళితుల మధ్య చిచ్చురేపి విడదీయాలని చూసిన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి నాయకులు విమర్శించారు. ఆదివారం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు ఆర్.జె. ప్రకాష్, జై మాదిగ సేవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొదమల బెంజిమెన్, మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు పి. రమేష్‌తో పాటు రాష్ట్ర ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు మామిడి రవిశంకర్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఎస్‌సిలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. మాదిగ, మాల, రెల్లి అంటూ మూడు రకాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి మధ్య విభేదాలు పెట్టి మోసం చేశారన్నారు. రద్దు చేసిన 27 పథకాలను మరల సాధించుకోవడానికి టిడిపిని గెలిపించుకోవాలన్నారు. దళితులకు న్యాయం జరగాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు గొండేల ప్రకాష్, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కంచుబారికి పైడిరాజు, దేవరపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు మద్దతివ్వండి

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి ప్రజా పాలనకు మద్దతివ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. పట్టణంలోని 29వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైసిపి నాయకులు శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత వైసిపితే**

ఎన్నికల హామీలను 99శాతం అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగిచ, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. కోరాడవీధిలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఎన్నికల మ్యానిఫెస్టోను 99శాతం సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. మే 1న బొబ్బిలిలో

బొబ్బిలి: ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

జరగనున్న సిఎం జగన్ ఎన్నికల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. బలిజిపేట రోడ్డులో వాటర్ ట్యాంక్ వద్ద ఉదయం 10గంటలకు బహిరంగ సభ ప్రారంభం అవుతుందన్నారు.

**వైసిపిలోకి 50కుటుంబాలు చేరిక**

మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన 50 టిడిపి కుటుంబాలు ఆదివారం వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. మాజీ ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణ, మాజీ వార్డు మెంబర్ కర్రి జగన్నాథం, కో-ఆపరేటివ్ మాజీ అధ్యక్షులు కర్రి సీతంనాయుడు, ఎం.బలరాం, ఎల్.లక్ష్మణ, ఎం.పోలినాయుడు, మరో 44కుటుంబాలు టిడిపిని వీడి ఎమ్మెల్యే శంబంగి, నియోజకవర్గ పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసిపిలో చేరాయి. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంక్షేమం చూసి మరోసారి అవకాశమివ్వండి**

**డెంకాడ :** సంక్షేమం, అభివృద్ధి చూసి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ మణిదీప్‌నాయుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఆదివారం అమకాం, రఘుమండ పంచాయతీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. పెద్దతాడివాడలో ఎంపిటిసి గాదిపిల్లి రమేష్, కరుమజ్జి త్రినాధరావు, సురేష్, గురునాయుడు ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచులు దిండి అప్పారావు, గూడేల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కడుబండి

**వైసిపిలో చేరిన మేజర్ పంచాయతీ సర్పంచ్**

**శృంగవరపుకోట:** మండలంలోని ధర్మవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ గాలి సన్యాసయ్య, వార్డు సభ్యులు దార కాంతం, అలమండ ప్రసాద్, రొబ్బి కోట లక్ష్మి, దాసరి వెంకట కళ్యాణితో పాటు 300 కుటుంబాలు ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు, నియోజకవర్గం పరిశీలకులు తైనాల విజయ్ కుమార్ ఆద్వర్యంలో వైసిపిలో చేరారు. పార్టీలో చేరినవారికి ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు పార్టీ కండువాలువేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైసిపి మండల అద్యక్షుడు మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు రెహమాన్, పాలకుర్తి హరినాథ్, కోసూరు భారతి, డాక్టర్ వరలక్ష్మి, అల్లు మహాలక్ష్మి నాయుడు (బుజ్జి), దూల కనకమహాలక్ష్మి, లగుడు అవతారం, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో రైతులకు నష్టం

ప్రజాశక్తి - గుర్ల

ల్యాండ్ టైటిల్ లింగ్ చట్టంతో రైతులకు నష్టం చేకూర్చి ఆ భూములను తన గుప్పెట్లోకి తెచ్చుకునేందుకు జగన్ మోహన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని చీపురపల్లి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఆదివారం ఆయన, ఉమ్మడి ఎమ్‌పి అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడుతో కలిసి లవిడాంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళా వెంకటరావు మాట్లడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతుల భూములను తన చేతిలోకి తీసుకుని వాటి మీద కూడా అప్పులు వాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వ పరిపాలనలో రాష్ట్రం అన్ని విధాల వెనుకబడిందన్నారు. తనను ఎమ్మెల్యేగా, అప్పలనాయుడును ఎమ్‌పిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిరుముల రాజు కిరణ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వర రావు, సర్పంచ్ గొర్లె రామలక్ష్మీ, గోవింద్, రమణ, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

**టిడిపితోనే అభివృద్ధి సాధ్యం**

**బొబ్బిలి:** టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన, ఎమ్‌పి అభ్యర్ది కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మున్సిపాలిటీలోని 26వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఇద్దరూ ఓట్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఉపాధి లేక నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి

బొబ్బిలి: ప్రచారం చేస్తున్న బేబినాయన, కలిశెట్టి

అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, బాబు పాలూరి తదితరులు పాల్గొన్నారు.

**టిడిపిలోకి 70 కుటుంబాలు చేరిక**

మండలంలోని పెంట గ్రామానికి చెందిన 50వైసిపి కుటుంబాలు, ముత్తావలస గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. పెంట ఉపసర్పంచ్ చింతల నారాయణరావు, వార్డు మెంబర్ తిమనాన సత్యం, మరో 48కుటుంబాలు, ముత్తావలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బి.ఈశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ జె.నాగభూషణ్, మాజీ వార్డు మెంబర్ జె. రామారావుతో పాటు మరో 16మంది బేబినాయన సమక్షంలో పార్టీలో చేరారు.

**వైసిపి అరాచకాలపై చార్జ్ షీటు విడుదల**

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా ఆదివారం వైసిపి అరాచకాలపై చార్జ్ షీటును విడుదల చేశారు. పెత్తందారీ పాలనలో రాష్ట్రం విధ్వంసం, రాష్ట్రంలో ప్రజల జీవితాలు అగమ్యగోచరం, మద్యం రేట్లు పెంచి లక్ష కోట్లు దోపిడీ పదిసార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై 75 వేల కోట్ల భారం వేసిన అంశాలను ఈ చార్జ షీట్‌లో పొందిపరిచినట్లు చెప్పారు.

**ప్రజలను మోసం చేసిన వైసిపి**

**గంట్యాడ:** వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అటువంటి పార్టీకి బుద్ధి చెప్పాలని టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సిరిపురం, మోకాలపాడు, రామభద్రపురం, వసాది, బోనంగి, కొట్టారు బిల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఒక అవకాశం ఇవ్వండి అని చెప్పి జగన్ ప్రజలను మోసం చేశారన్నారు. ఐదేళ్ల కాలంలో ఎక్కడా ఒక అభివృద్ధి పని చేయలేదని విమర్శించారు. మే 13న జరిగే ఎన్నికలలో ఎమ్‌పి అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడుకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

**240 కుటుంబాలు టిడిపిలో చేరిక**

సిరిపురం గ్రామంలో ఆకిరి శ్రీనివాసరావు సమక్షంలో 100 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. కొట్టారుబిల్లి గ్రామంలో సూర్యనారాయణ, వెంకటరావు, దేవుడు సమక్షంలో 50 కుటుంబాలు, బోనంగి దాడి చెరువు కల్లాకు చెందిన 90 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి.

**టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కళా**

గుర్ల: మాట్లాడుతున్న కళా వెంకటరావు

ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కరనాయుడు, మాజీ జెడ్‌పిటిసి కొరుపోలు రమేష్ కుమార్, రంది రాము, అల్లు విజయ్, రంది చిన్న రామునాయుడు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

**జామి:** టిడిపి అధికారంలోకి వస్తే సమస్యలు పరుస్కారమవుతాయని గజపతినగరం టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం లోట్లపల్లిలో మండల అధ్యక్షులు స్వామినాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికీ పర్యటించారు. టిడిపికి ఓటు వేసి తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. అనంతరం కుమరాం గ్రామంలో పలువురు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనియాలా పైడిరాజు, సూర్యారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

**గొల్లపేటలో 30 కుటుంబాలు టిడిపిలో చేరిక**

**రామభద్రపురం:** మండలంలోని గొల్లలపేటలో 30 కుటుంబాలు వైసిపిని వీటి టిడిపిలో చేరాయి. జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు ఆధ్వర్యంలో వీరంతా టిడిపి జోనల్ కోఆర్డినేటర్ -2 సుజయకృష్ణ రంగారావు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకిస్తూ తామంతా వైసిపిని వీడామన్నారు. బొబ్బిలి అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన విజయానికి తామంతా ఐకమత్యంతో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, కర్రోతు వెంకన్న, ఉపసర్పంచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

# సిపిఎంని గెలిపించండి

ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు రాకోటి రాములు

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజన చట్టాలు, ఉపాధి హామీ చట్టం రక్షణకు ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు ఎమ్‌పి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని సిపిఎం నాయకులు రాకోటి రాములు కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పనుకువానివలస, కొండలింగాలవలస, కూనేరు, రేగులపాడు, సంగంగుడ్డివలస, మల్లేడవలస, సారాడవలస తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ గిరిజనుల కోసం చేసిన అటవీ హక్కుల చట్టానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సవరణలు చేస్తూ గిరిజనులకు హక్కులు కల్పించకుండా గిరిజన ప్రాంతాల నుండి వెల్లగొట్టేందుకు పూనుకుందన్నారు. ఉప ముఖ్యమంత్రులుగా పనిచేసిన పుష్పశ్రీవాణి, రాజన్నదొర గిరిజనులకు కనీసమైన మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారని, షెడ్యూల్ ఏరియాలో గిరిజన గ్రామాలను చేర్చలేకపోయారని గుర్తు చేశారు. జరగబోయే సాధారణ ఎన్నికల్లో గిరిజనులు ప్రజలు మార్పు కోరి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి ఎమ్‌పి అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గేదెల పెదరాము, సిడగం జానకిరాము, సన్యాసి, సూర్యనారాయణ, డి రాము, సోములు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - విజయనగరం కోట

పట్టణంలోని ఎన్‌సిఎస్ థియేటర్ రోడ్‌లో గల పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఈ నెల 30న మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని పట్టణానికి చెందిన విశ్వ కళాపరిషత్ సంస్థ ప్రతినిధి, ధార్మికవేత్త పెంటపాటి ముత్యాలు తెలిపారు. పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితులు ఉపద్రష్ట వెంకట వరప్రసాద్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పంచముఖ హనుమాన్ దేవాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పెంటపాటి కామరాజు మాట్లాడుతూ పట్టణంలోని కాష్వీ హాస్పిటల్‌కి చెందిన ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్ ఉచితంగా తనిఖీలు నిర్వహించి చికిత్స నిర్వహిస్తారన్నారు. వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో విశ్వ కళాపరిషత్ ప్రాజెక్ట్ చైర్మన్ వాకర్స్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్ర దేవి, పెంటపేట ముత్యాలు, ధరణి డెవలపర్స్ చైర్మన్ కాపారపు వెంకటరమణ, శ్రీనివాస్, పుష్పగిరి ఆసుపత్రి ప్రతినిధి భీమశంకర్ తదితరులు పాల్గొని వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

## పార్వతీపురంలో వైసిపికి ఎదురీత

(మొదటి పేజీ తరువాయి)

బాగుచేయడం, పొడింగిచండం ద్వారా పార్వతీపురం, సీతానగరం మండలాలకు సాగునీరు అందించాలన్న రైతుల ఆకాంక్షనూ ఎమ్మెల్యే పట్టించుకోలేదు. సీతానగరం పిహెచ్ భవన నిర్మాణం పూర్తిచేయకపోవడంపైనా జనం గుర్రుగా ఉన్నారు. ఇవన్నీ స్థానిక ఎమ్మెల్యేకు ప్రతికూల అంశాలుగా కనిపిస్తున్నాయి. ఇలా సొంతపార్టీలోనూ, సాధారణ ప్రజానికంలో ఎమ్మెల్యే వైఖరిపై చర్చజరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

టిడిపి అభ్యర్థి విజయచంద్ర రాజకీయాలకు కొత్తకావడం, వైసిపి, ఎమ్మెల్యే సాధించలేని, పరిష్కరించలేని సమస్యలను జనాల్లో ప్రచారం చేయడం చర్చనీయాశంగా మారింది. అయితే, రాష్ట్రంలో ప్రత్యేకించి వెనుకబడిన పార్వతీపురంజిల్లాకు ఎటువంటి న్యాయమూ చేయని బిజెపితో జత కట్టడం వల్ల టిడిపి అభ్యర్థిని జనం ఎంతవరకు ఆమోదిస్తారో అనే విషయమై చర్చ నడుస్తోంది. చంద్రబాబు కూడా తన హయాంలో అనేక హామీలు ఇచ్చినా అమలు చేయలేదు. జంఝావతి, తోటపల్లి పూర్తికి చొరవ చూపలేదు. తగినన్ని నిధులు కూడా కేటాయించలేదు. ఆ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్వాసితులు కూడా రోడ్డున పడ్డారు. రామతీర్థం వంటి ఘటనల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టే బిజెపి పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉంది. నియోజకవర్గంలో చెరువులు, పార్కులు ఆక్రమణల సందర్భాల్లోను, జగనన్న లే అవుట్లలో పేదలకు జరిగిన అన్యాయంలోను టిడిపి నోరు మెదపలేదు. ఈ నేపథ్యంలో ఒకరి ఓట్లు ఒకరికి అనుకూలంగా మారుతాయా? లేక కాంగ్రెస్‌కు పడే అవకాశం ఉంటుందా? వేచిచూడాల్సిందే.

## ప్రణాళికా బద్ధంగా రిసెప్షన్ సెంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

రిసెప్షన్ సెంటర్‌కు ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్, మిగిలిన అసెంబ్లీ స్థానాల లెక్కింపు జరిగే లెండి కళాశాలకు మెప్మా పీడీ సుధాకర్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావును ఇన్‌ఛార్జులుగా నియమించినట్లు తెలిపారు. రిసెప్షన్ సెంటర్‌లో ట్యాబ్యులేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఓటర్ల నమోదు వివరాలను అక్కడే సమర్పించాలని సూచించారు. పరిశీలకుల కోసం కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, మరునాడు అక్కడ స్క్రూటిని నిర్వహిస్తారని తెలిపారు. ఏ కౌంటర్లో ఇవ్వాల్సిన వివరాలను అక్కడే ఇవ్వాలని అన్నారు. ఏమైనా సందేహాలు తలెత్తితే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. స్పెషల్ కౌంటర్‌లో సమయ నిర్వహణ చాలా కీలకమని, ఇక్కడ పని వేగంగా జరగాలని ఆదేశించారు. అలాగే స్ట్రాంగు రూముల్లో ఇవిఎంలను నిర్ధేశించిన విధంగానే భద్రపరచాలని చెప్పారు. సెక్టార్ అధికారుల కౌంటర్లో రిజర్వుడు ఇవిఎంలను అందజేయాలని సూచించారు. శిక్షణలో జెసి కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, పార్లమెంటు ఎఆర్‌ఒ సుమబాల, రిటర్నింగ్ అధికారులు, వేదిక ఇన్‌ఛార్జిలు, నోడల్ అధికారులు, ఎఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైసిపి పాలనలో రాష్ట్రం అప్పులపాలు

పూల్‌బాగ్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న స్థానికులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వైసిపిపాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం విజయనగరంలోని పుత్సలవీధి నాలుగు రోడ్ల జంక్షన్ లో , పూల్ బాగ్ కోలనీ న్యూ కోర్టు జంక్టన్ (బ్రిడ్జ్ జంక్షన్) లో నిర్వహించిన బహిరంగ సభల్లో పాల్గొన్న అశోక్‌తో పాటు టిడిపి అభ్యర్థి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీ పెరిగిపోయిందన్నారు. గత ఐదేళ్లలో 10 లక్షల మందికి పైగా విద్యార్థులు బడికి దూరమయ్యారని తెలిపారు, స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారని అన్నారు. బాధ్యత కలిగిన ప్రభుత్వాలను మనం ఎక్కుకోవాలని ప్రజలను కోరారు. భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం బాధ్యత కలిగిన కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ పూసపాటి అశోక్ గజపతిరాజు విజయనగరాన్ని ఎంతో అభివృద్ధి చేస్తారన్నారు, నగరాన్ని విస్తరింప చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించి వారి ఆర్థిక, సామాజికాభివృద్ధికి తోడ్పడ్డారని అన్నారు. కానీ నేటి వైసిపి ప్రభుత్వం దానికి పూర్తిభిన్నంగా వెళుందన్నారు, అభివద్ధి జాడే కనపడటం లేదని విమర్శించారు. ఎవరు మంచి పనులు చేసారు, ఎవరు షో వర్క్‌లు చేస్తూ, మాయమాటలు చెపుతన్నారో ప్రజలు గమనించాలని కోరారు. యువత భవిష్యత్తును నాశనం చేసిన చెత్త ప్రభుత్వమిది అని విమర్శించారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కార్మికులదే కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్లు కార్మిక శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో కార్మికులు, వారి కుటుంబాలతో కలుపుకొని సుమారుగా 40 వేల పైన ఓట్లు ఉన్నట్లు కార్మిక నాయకులు చెబుతున్నారు.

అంతే కాకుండా భవణనిర్మాణ కార్మికులు, రిక్షాకార్మికులు, ఆటోరిక్షా కార్మికులు, గీత కార్మికులు, కళాసీలు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశావర్కర్లు, ఫీల్డు అసిస్టెంట్లు, ఐకెపి సిబ్బంది తదితరులంతా వివిధ అనుబంధ సంఘాలతో ముడిపడి ఉన్నారు. నియోజకవర్గంలో వీరంతా కలిపి సుమారుగా 10వేలకు పైగానే ఉన్నారు. వీరి కుటుంబాలుతో కలుపుకొని సుమారుగా 30 వేల ఓట్లు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విధంగా చూసుకుంటే నియోజకవర్గంలో సుమారుగా 70 వేల పైగా ఓట్లును శాసించే స్థాయి కార్మికులకు ఉంది. నెల్లిమర్ల నియోజక వర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ముఖ్యంగా త్రిముఖ పోటీ నెలకొంది. వైసిపి నుండి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎన్‌డిఎ కూటమి నుండి లోకం మాధవి నువ్వా నేనా అన్నరీతిగా తలపడుతున్నారు. వీరితో పాటు ఇండియా వేదిక నుంచి వామపక్షాల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి సరగడ రమేష్ కూడా బరిలో ఉన్నారు.

### కార్మికులు మద్దతే కీలకం

నియోజకవర్గంలో కార్మికుల మద్దతు ఉన్న వారే ఎమ్మెల్యేగా విజయం సాధించే పరిస్థితి గతంలో నెలకొంది. నియోజకవర్గంల సిపిఎం అనుబంధ సంఘాలకు బలముందన్న సంగతి తెలిసిందే. ఆ బలాన్ని విజయానికి మలుచుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుంది. దాంతో తాను కూడా పోటీలో ఉన్నానంటూ ప్రధాన పార్టీలకు కాంగ్రెస్ అభ్యర్థి చెమటలు పట్టిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నెల్లిమర్ల నియోజకవర్గంలో విజయకేతనం ఎగరవేయాలంటే కార్మిక ఓట్లు కీలకమని గ్రహించిన ప్రధాన పార్టీలు వారి వద్దకు పరుగులు పెడుతున్నారు. మద్యం, నగదు ఎరవేస్తూ విజయతీరాలకు చేరాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో నాలుగు మండలాల్లో మొత్తం 2,13,551 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1, 05, 613 మంది, స్త్రీలు 1, 07, 935 మంది ఉన్నారు. ట్రాన్స్‌జండర్ ముగ్గురు ఉన్నారు. చెబుతున్నారు. ఈ సారి అభ్యర్థులు 80 వేల ఓట్లు వస్తే విజయం సాదించవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. అయితే నియోజకవర్గంలో కార్మిక కుటుంబాలవే సుమారుగా 70 వేల ఓట్లుండడంతో కార్మిక ఓట్లే కీలకంగా మారాయని జరుగుతుంది. త్రిముఖ పోటీలో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

## మందులపై జిఎస్‌టి తొలగించాలి

ప్రభుత్వాన్ని కోరారు. ఆర్అండ్‌బి అతిథి గృహం సమీపంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ ఆశా సుబ్బారావు ఐఎంఎ హాలును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం అశోకన్ మాట్లాడుతూ సరియైన వైద్యంతో పాటు ఆరోగ్య నిర్ణయకాలైన రక్షిత తాగునీరు, పరిసరాల పరిశుభ్రత నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరికీ ప్రాథమిక ద్వితీయ తృతీయ స్థాయి వైద్యానికి తగిన కనీస వైద్య ప్యాకేజీకి సాధికారత కల్పించాలన్నారు. సొంత చెల్లింపులతో చేసుకొనే ఆరోగ్య బీమా వల్ల అరా కొర సేవలు మాత్రమే లభిస్తాయన్నారు. ప్రభుత్వ రెవెన్యూ ఆదాయం ఆరోగ్య నిధులకు మూలంగా ఉండాలన్నారు దేశంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సగటున ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నది జిడిపిలో 1.1 శాతం నుండి 1.6శాతంగా మాత్రమే ఉందన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత తక్కువని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యానికి విడివిడిగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేకంగా వైద్య ఆరోగ్యాలకు 2.5శాతం నిధులు తక్షణం కేటాయించాలన్నారు. దీన్ని క్రమంగా 5.5 శాతానికి పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డాక్టర్లపై దాడులకు రక్షణగా అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 11/2008 చట్టాన్ని తీసుకొచ్చారని, దానికి అనుగుణంగానే కేంద్రంలో కూడా ఇటువంటి చట్టాలు తీసుకొస్తే డాక్టర్లపై దాడులను నియంత్రించవచ్చని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నియంత్రణకు అక్రిడిటేషన్ విధానం మంచిదన్నారు. ప్లానింగ్ మిషన్ల సలహాలను పెడచెవిన పెట్టి ఆసుపత్రుల నియంత్రణ చట్టాలను తీసుకురావడం ప్రైవేట్ రంగానికి శాపంగా మారిందన్నారు, ఇప్పటికైనా అక్రిడేటెషన్ విధానం ద్వారా నియంత్రణ చట్టాల కోరలునుంచి అన్ని తరగతుల ఆసుపత్రులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఫణిందర్, రాష్ట్ర ఐఎంఎ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవీంద్రనాథ్, రాష్ట్ర ఐఎంఎ మాజీ అధ్యక్షులు డాక్టర్ జి రవికష్ణ, 2025- 26 సంవత్సరానికి ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.నందకిశోర్, ఐఎంఎ విజయనగరం అధ్యక్షులు డాక్టర్ వి.అశోక్, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు, కోశాధికారి డాక్టర్ ఎ.సునీల్, ఐఎం చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ వివిఎస్ ప్రసాద్, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి గోపాల్ రావు, చారిటబుల్ ట్రస్ట్ ఐఎఎఎ సెక్రెటరీ డాక్టర్ వి. మృత్యుంజయరావు, డాక్టర్ కె.త్రినాధరావు, ఐఎంఎ సభ్యులు పాల్గొన్నారు.

## లింగాలవలసలో వివాదంపై కేసు నమోదు

**భోగాపురం :** మండలంలోని లింగాలవలస గ్రామంలో ప్రచారం సందర్భంగా ఆదివారం జరిగిన వివాదంపై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో బాడితిబోయిన శ్రీను అనే వ్యక్తి వాటర్ బాటిల్స్‌తో ఆటోలో వస్తుండగా ప్రచార రథం అడ్డుగా ఉందని పక్కన పెట్టమని పక్కనే ఉన్న ముని కిషోర్‌కు చెప్పాడు. ప్రచార వాహనాన్ని తీయమంటావా అంటూ చేతిలో ఉన్న కర్రతో శ్రీను ముఖంపై కొట్టడంతో ముక్కుపై గాయమైంది. అక్కడే ఉన్న ముని సన్యాసి, సూరి కూడా శ్రీనుపై దాడి చేశారు. దీంతో శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

## 20 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని కౌలువాడలో పాన్‌షాప్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎరుసు రాము అనే వ్యక్తిని పట్టుకున్నట్లు సిఐ రవికుమార్ తెలిపారు. ఆయన వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో**
**O.S. 125/2018**

Between:
ఆరిశెట్టి అశోక్ కుమార్ గుప్తా .........వాది
And :
శ్రీకాకుళపు నర్సింగరావు (Died)
శ్రీకాకుళపు త్రివేణి వగైరాలు. .....ప్రతివాదులు
To
4వ ప్రతివాది
శ్రీకాకుళపు శంకరరావు, S/o లేటు నర్సింగరావు, వ॥ 30 సం॥లు, వ్యాపారం, మోసూరు గ్రామం, పాచిపెంట మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారు పలుమార్లు దావా సమన్లు పంపించినప్పటికీ మీరు దావా సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీకు ఈ వార్తా పత్రిక ద్వారా తెలియజేయమని **తే 14-5-2024దీ** నాటికి వాయిదా వేసినారు. కావున ఆ తేదీనాడు మీరు **ఉదయం గం॥ 10-30 ని॥ల**కు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షముగా తీర్మానించెదరు.

**శ్రీ లావుడి ఏకదంతేశ్వరరావు**
న్యాయవాది, లావుడివీధి, సాలూరు
సెల్ : 9440913367

## సిపిఎం అభ్యర్థులను గెలిపించండి...

# గిరిజన హక్కులు కాపాడుకోండి

గుమ్మలక్ష్మీపురం.. గిరిజనులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ

**ఏజెన్సీలో విస్తృతంగా ప్రచారం**

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో ఇండియా బ్లాక్ బలపర్చిన సిపిఎం ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులను గెలిపించి గిరిజనుల హక్కులను కాపాడుకోవాలని కురుపాం నియోజకవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మారుమూల ప్రాంతాలైన జర్న, గోయిపాక పంచాయతీల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మోడీ పదేళ్ల కాలంలో రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన సాగిస్తూ గిరిజన హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేశారని అన్నారు. దీంతో గిరిజనుల రిజర్వేషన్లు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ఏజెన్సీలో గిరిజనులకు నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ 3ను రద్దు చేశారని తెలిపారు. 1/70 చట్టం, పీసా, అటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలు కావడం లేదన్నారు. తరతరాలుగా అడవినే నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులను కంపెనీల పేరుతో దూరం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఏజెన్సీలో వందలాదిమంది చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక దూరప్రాంతాలకు వలసలు పోవాల్సి వస్తుందని తెలిపారు. మరోవైపు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేదని, సాగునీటి వనరుల్లేక గత నాలుగేళ్లుగా కరువు తాండవిస్తోందని అన్నారు. గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎ, జిసిసి వంటి సంస్థలు ఉన్నా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. మళ్లీ మోడీ అధికారంలోకి వస్తే గిరిజనుల జీవనం అంధకారం కాక తప్పదు అన్నారు. ఇటువంటి తరుణంలో నిరంతరం గిరిజన సమస్యలపై పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపించినప్పుడే హక్కులకు, చట్టాలకు రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మండంగి శ్రీనివాసరావు, పువ్వల తిరుపతి, ఈశ్వరరావు, పాండురంగారావు తదితరులు ఉన్నారు.

### జోరుగా సిపిఎం ప్రచారం

**సీతంపేట :** మండలంలోని పూతికవలస, డొంబంగివలసలో గ్రామాల్లో సిపిఎం జోరుగా ఎన్నికల ప్రచారం చేస్తోంది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంగారపు సింహాచలం ఆదివారం ఆధ్వర్యాన ఈ ప్రచారం సాగుతోంది. అరకు పార్లమెంటు సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనరస, ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని గిరిజనులను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సల్బంపాడు, నెల్లిగండి, ఈతమానుగూడ, సావిడివలస, గురండి, పుట్టిగాం, గ్రామల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గిరిజనులకు అండ ఎర్రజెండా ఒకటేనన్నారు. సమస్యలు పరిష్కారం దిశగా సిపిఎం బలపరిచిన అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సర్పంచ్ వీరన్న కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**భామిని :** భామిని, బొడ్డగూడ, మణిగ పంచాయతీలోని గ్రామాల్లో సిపిఎం బృందం ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. ఇండియా కూటమి తరపున అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనరసయ్య గుర్తు సుత్తి, కొడవలి, నక్షత్రంపై ఓటువేసి గెలిపించాలని కోరారు. గిరిజనులు హక్కులు రక్షణ కోసం నిరంతరం సిపిఎం కృషి చేస్తుందని, అప్పలనరసకు ఓటేసి గెలిపించి పార్లమెంటుకు పంపాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్, భాస్కరరావు, జగన్నాయకులు, మిన్నారావు, ప్రసాద్, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొమరాడ :** మండలంలోని గుమడ సంత, సరుగుడుగోడ, చోళ్లపదం, ఇంద్రనగరం, గాంధీనగరం, బంగారంపేట, కొమట్లపేట, అల్లువాడ, ఉలిపిరివలసలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వి.ఇందిర, ఎ.జగన్మోహన్, కె.సాంబమూర్తి, గోపాల్ మాట్లాడుతూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, గిరిజనులు, మైనార్టీ, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అన్నివేళలా నికరంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులుగా కురుపాం అసెంబ్లీకి స్థానానికి మండంగి రమణ, అరకు పార్లమెంటరీ స్థానానికి పాచిపెంట అప్పలనరస పోటీ చేస్తున్నారని, వీరి గుర్తు సుత్తి కొడవలి నక్షత్రం కావున ఈ గుర్తుపై ఓటు వేసి అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో సిపిఎం నాయకులు రామారావు, లక్ష్మ, శివున్నాయుడు, ప్రసాద్, సురేష్, గోపాలం, మధు పాల్గొన్నారు.

**సాలూరు రూరల్ :** బిజెపికి ప్రత్యక్షంగా మద్దతిస్తున్న టిడిపి, జనసేన, పరోక్షంగా మద్దతిస్తున్న వైసిపి అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం నాయకులు సీదరపు అప్పారావు, మర్రి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని నెలిపర్తి, బర్ణికవలస, బట్టి వలస గ్రామాల్లో ఇండియా బ్లాక్ అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించిన వారు మాట్లాడుతూ దేశాన్ని అన్ని విధాలా మోసగిస్తూ మతతత్వ రాజకీయాలు చేస్తున్న బిజెపి ప్రభుత్వం కులాలుగా, ప్రాంతాలుగా విడగొడుతూ, సామాన్యులపై నిత్యవసర ధరలు బాదుడు వేస్తూ ప్రజలకు నష్టం చేకూర్చే చట్టాలను చేందన్నారు. వీటికి గుడ్డిగా రాష్ట్రంలో మద్దతు తెలియజేస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలకు తగిన బుద్ధి చెప్పాలంటే ఈ ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులు పాచిపెంట అప్పలనరస, మువ్వల పుష్పారావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కూనేటి చిన బాబు, పొట్టంగి రాము, మర్రి మసి పాల్గొన్నారు.

**పాచిపెంట :** ఇండియా బ్లాక్ బలపర్చిన అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనరస గెలిపించాలని కోరుతూ సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, సుర్రు రామారావు పాచిపెంటలో ఆదివారం ప్రచారం చేశారు. బిజెపికి సహకరించిన అన్ని పార్టీలను ఓడించాలని ఇండియా బ్లాక్ బలపర్చిన అరకు అభ్యర్థి అప్పలనరసకు అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్లో మన వాణిని వినిపించాలని సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేయాలని కోరారు.

సీతంపేట.. సిపిఎం ఎంపి అభ్యర్థి అప్పలనర్సకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

## ఉద్దండులు ఏలిన నియోజవర్గంలో..

# సమస్యలు దండి

గిరి శిఖర గ్రామాల్లో ఊటగెడ్డలో నీరు పడుతున్న గిరిజన మహిళలు

**ఉద్దండుల ఏలిన కురుపాంలో నియోజకవర్గంలో సమస్యలు దండిగానే పేరుకుపోయాయి. ఇక్కడ నుంచి ప్రముఖులు శాసనసభకు, పార్లమెంటుకు ఎన్నికై రాష్ట్ర, కేంద్ర మంత్రివర్గంలో స్థానం సంపాదించినా సమస్యలన్నీ అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. ఆయా సమస్యలు ఎన్నికల సమయంలోనే నేతల ప్రచారంలో ప్రస్తావనకు రావడం, ఆపై వాటిని మరువడం సర్వసాధారణమైంది. గతంలో కాంగ్రెస్, టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాల హయాంలో ఏం జరిగింది ఏం జరగలేదు అనేదే ఇప్పుడు కీలకంగా మారింది. పాలకుల తీరుతో నేటికీ గిరిజనులకు కనీస సౌకర్యాలు కరువై దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. గిరిపుత్రుల కోసం రాజ్యాంగం అవకాశాన్ని కల్పించినప్పటికీ విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అవకాశం లేక గిరిపుత్రులు కాలం వెళ్లదిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెబుతున్నా ఆ నిధులు నేతిబీరలో నెయ్యి చందంగా మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.**

- ప్రధాన సమస్యలతో జనం విలవిల
- నేటికీ గిరిజన ప్రజానీకానికి అందని మౌలిక వసతులు
- కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రులుగా ఉన్న నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో 23 పంచాయతీల పరిధిలో 309 గిరిజన గ్రామాలున్నాయి. 28 వేల కుటుంబాలు 71,288 మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అయితే మండలంలో అనేక గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యం లేదు. దీంతో గిరిజనుల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తిత్తిరి, నీలకంఠాపురం, వలస బల్లేరు పంచాయితీల్లో కోసంపాడు, చాపరాయిగూడు, తులసి, పెద్ద తులసి, వెలగమానుగూడ, ఇలా చాలా గిరిజన గ్రామాలకు సరైన రహదా సౌకర్యం లేదు. ఉపాధి హామీ ద్వారా కొన్ని చోట్ల పనులు చేపట్టినా అవి వర్షాలకు కొట్టుకుపోయి ఉపయోగంలో లేకుండా పోయాయి. దీంతో గిరిజనులకు కాలిబాలే ఆధారమైంది.

### కలుషిత నీరే ఆధారం

సీడుగూడ, పులిపుట్టి, ఏగువ పులిపుట్టి, కోశంపాడు కీడవాయి తదితర గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం లేదు. గిరిజనులు స్వయంగా గెడ్డల్లో ఊట బావులు తీసుకొని నీరు తాగుతున్నారు. చెలమల నీరే ఆధారం ఇలా కలుషితమైన నీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కొన్ని గిరిజన గ్రామాల గిరిజనులు స్వయంగా డబ్బులు పోగేసుకుని ఊట గెడ్డ ల ద్వారా నీరు తెచ్చి నిల్వ ఉంచుకొని తాగుతున్నారు.

### చదువు కోసం..

మరోవైపు ప్రభు త్వాలు విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణ కొంప ముంచు తున్నాయి. వెలగమానుగూడ, డోకులుగూడ, వేపమానుగూడ, నాంద్ర గండ తదితర గిరిజన గ్రామాల్లో పాఠశాలలు మదింపు కుదింపుల్లో భాగంగా మూతపడ్డాయి. దీంతో విద్యార్థులు కిలోమీటర్ల దూరంలో పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసించాల్సి వస్తోంది.

### పేరుకే జిసిసి

గిరిపుత్రుల అభివృద్ధికి ప్రత్యేకించి కార్పొరేషన్ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలందడం లేదు. కొండకోనల్లో అడవులను నమ్ముకొని పోడు వ్యవసాయం చేసుకుంటూ చాలీచాలని ఆదాయంతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు. అనారోగ్యానికి గురైతే అందుబాటులో ఆస్పత్రులుండవు. ఇప్పటికైనా పాలకులు, అధికారుల స్పందించి గిరిజన గ్రామాలను అభివృద్ధి పర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

### చెక్ డ్యాముల నిర్మాణంలో పాలకుల నిర్లక్ష్యం

నియోజకవర్గంలో గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే 15 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. కురుపాం, కొమరాడ, జియ్యమ్మ వలస, గరుగుబిల్లి మండలాల్లో 52 గ్రామాల రైతాంగానికి బాసటగా నిలుస్తుంది. కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్ర దేవ్ కోటకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గుమ్మిడి గెడ్డ ప్రవహిస్తుంది. ఆయన నాలుగు సార్లు ఎంపీగా ఎన్నికై కేంద్ర మంత్రి పదవులు చేపట్టినా పూర్తి చేయలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా సుదీర్ఘకాలం పాటు అధికారంలో ఉన్న శత్రుచర్ల విజయ రామరాజు, వైసిపి హయాంలో డిప్యూటీ సిఎంగా ఉన్న పుష్పశ్రీవాణి కూడా దీన్ని పట్టించుకోలేదు. మరోవైపు గుమ్మిడిగెడ్డకు ఒట్టిగెడ్డ అనుసంధానం చేయడం వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఒక్క గుమ్మడి గెడ్డ కాదు ఇలా గిరిజన గ్రామాలు పనసభద్ర సమీపంలో డేకురాయి వద్ద చెక్ డాం నిర్మిస్తే 1500 ఎకరాలు, వలసబల్లేరు వద్ద చెక్ డాం నిర్మిస్తే 750 ఎకరాలు బీడు భూములు సస్యమలవుతాయి ఇలా నియోజకవర్గంలో కేదారిపురం గెడ్డ, దేరువాడ గెడ్డ , తాడికొండ గెడ్డ, కనుసుల గెడ్డ, డెకురగెడ్డ తదితర గెడ్డలపై మినీ రిజర్వాయర్ నిర్మాణానికి కేవలం 60 కోట్లు ఖర్చు చేస్తే గిరిజన ప్రాంతం సస్యమలమవుతుంది. సిపిఎం, గిరిజన సంఘాలు ఏళ్ల తరబడి సమస్యలు ప్రస్తావనకు పాలకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరినా పాలకులు గాలికి వదిలేస్తున్నారు. ప్రచారానికి వందల కోట్లు ఖర్చు చేస్తూ గిరిజనుల సమస్యలు గాలికి వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కానీ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇవేవీ కార్యరూపం దాల్చకపోవడంతో గిరిజన రైతాంగం వర్షాధారం పైనే ఆధారపడి వ్యవసాయం చేయవలసిన పరిస్థితి ఉంది.

రైతులకు కలగా మిగిలిన గుమ్మిడి గెడ్డ చెక్‌డ్యామ్ నిర్మాణం



ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
సోమవారం
29 ఏప్రిల్ 2024

*విజయనగరం జిల్లాలో గజపతినగరం నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. నియోజకవర్గ పరిధిలోని నాయకులకే అత్యధిక సార్లు పట్టం కట్టిన ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేసిన సందర్భంలోనూ ఆదరించారు. అలాగే ప్రజాసోషలిస్టు పార్టీ, కాంగ్రెస్, జనతా, కాంగ్రెస్, టిడిపి, వైసిపి పార్టీవారినే కాకుండా స్వతంత్రంగా పోటీ చేసిన వారిని సైతం గెలిపించారు. 1983లో టిడిపి ఏర్పాటైన తరువాత 9సార్లు ఎన్నికలుజరగ్గా టిడిపిని ఐదుసార్లు, కాంగ్రెస్‌ను మూడుసార్లు, వైసిపిని ఒకసారి గెలిపించారు. నియోజకవర్గ 69ఏళ్ల చరిత్రలో ఇక్కడి నుంచి ఒకే ఒక్కరికి పడాల అరుణకు మంత్రివర్గంలో స్థానం దక్కడం గమనార్హం.*

# స్థానికులకే పట్టం

- టిడిపి ఆవిర్భావం తరువాత ఐదుసార్లు గెలుపు
- రెండుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసిపి విజయం
- 69 ఏళ్లలో ఒకరికే మంత్రిగా అవకాశం
- గజపతినగరం శాసనసభ నియోజకవర్గ చరిత్ర




ప్రజాశక్తి-గజపతినగరం

1955లో ఏర్పాటైన గజపతినగరం నియోజకవర్గంలో పోటీచేసి అన్ని పార్టీలనూ ప్రజలు ఆదరించారు. ఇక్కడి నుంచి రెండుసార్లు గెలుపొందిన పెనుమత్స సాంబశివరాజు 1972లో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం గమనార్హం. ఇక్కడి నుంచి గెలుపొందిన బొత్స అప్పలనర్సయ్య, పి.సాంబశివరాజు, కుసుమ గజపతిరాజు, జి.సూర్యనారాయణ జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ పోటీ చేసి గెలుపొందిన వారు. జంపాన సత్యనారాయణ రాజు, తాడి సన్యాసప్పలనాయుడు (వెంకటరావు) కెఎనాయుడు ఒక్కసారి మాత్రమే గెలుపొందగా, పడాల అరుణ మూడుసార్లు, జి.సూర్యనారాయణరాజు, టి.సన్యాసి నాయుడు, సాంబశివరాజు, వంగపండు నారాయణప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య రెండుసార్లు విజయం సాధించారు.

ఇక్కడ 1955లో ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్నప్పుడు గెలుపొందిన గంట్లాన సూర్యనారాయణ ఆ తరువాత విజయనగరం, రామతీర్థం, పాయకరావుపేటలో కలిపి ఆరుసార్లు గెలుపొందారు. 1955లోనే గెలిచిన కుసుమ గజపతిరాజు విజయనగరం రాజు, మాజీమంత్రి విజయరామగజపతిరాజు మొదటి భార్య.

ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేల్లో పడాల అరుణ చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. ఇక్కడ నుంచి గెలుపొందిన మిగతా ఏ ఎమ్మెల్యే మంత్రి కాలేదు. సాంబ శివరాజు ఇక్కడ ఎన్నికైనప్పుడు కాకపోయినా ఆ తరువాత 1991లో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గాల్లో పలుశాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

2007 -2008లో పునర్వ్యవస్థీకరణ తరువాత నియోజకవర్గంలో గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, జామి, దత్తిరాజేరు మండలాలు చేరాయి. 2009లో జెడ్‌పిటిసి పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ అభ్యర్థిగా బొత్స అప్పల నరసయ్య బరిలో నిలువగా, తెలుగుదేశం పార్టీ నుంచి పోటీచేసిన పడాల అరుణపై 17 వేల మెజారిటీతో గెలుపొంది మొదటిసారిగా శాసనసభకు ఎన్నికయ్యారు. 2014లో టిడిపి అభ్యర్థిగా కొండపల్లి అప్పలనాయుడు బరిలో నిలవగా వైసిపి నుంచి బరిలో నిలిచిన కడుబండి శ్రీనివాస్‌పై 19వేల మెజారిటీతో విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి పోటీలో దిగిన బొత్స అప్పల నరసయ్య ఏమాత్రం ప్రభావం చూపించ లేక పోయారు. 2019 ఎన్నికల్లో బొత్స అప్పల నరసయ్య బరిలో నిలవగా టిడిపి నుంచి కెఎ నాయుడు రెండోసారి బరిలో నిలిచారు. 26వేల ఓట్ల మెజారిటీతో అప్పలనర్సయ్య విజయం సాధించారు. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే అప్పల నరసయ్య మరోసారి వైసిపి నుంచి రంగంలో దిగారు. ఈసారి టిడిపి నుంచి మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు సోదరుడైన కొండబాబు తనయుడు కొండపల్లి శ్రీనివాస్‌కు టికెట్ కేటాయించడంతో నియోజకవర్గ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. అదే సందర్భంలో కాంగ్రెస్ నుంచి డోల శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన పడాల.అరుణ ప్రస్తుతం జనసేన పార్టీలో కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో గెలుపు అవకాశాలపై టిడిపి, వైసిపి ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**గజపతినగరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వారు**

| సంవత్సరం | అభ్యర్థి | పార్టీ |
|---|---|---|
| 2019 | బొత్స అప్పలనర్సయ్య | వైసిపి |
| 2014 | కెఎ నాయుడు | టిడిపి |
| 2009 | బొత్స అప్పలనర్సయ్య | కాంగ్రెస్ |
| 2004 | పడాల అరుణ | టిడిపి |
| 1999 | తాడ్డి వెంకటరావు | కాంగ్రెస్ |
| 1994 | పడాల అరుణ | టిడిపి |
| 1989 | పడాల అరుణ | టిడిపి |
| 1985 | విఎన్ఎ నాయుడు | కాంగ్రెస్ |
| 1983 | జె.సత్యనారాయణరాజు | టిడిపి |
| 1978 | విఎన్ఎ నాయుడు | జనతా |
| 1972 | పి.సాంబశివరాజుఏకగ్రీవం | కాంగ్రెస్ |
| 1967 | పి.సాంబశివరాజు | ఇండి |
| 1962 | టి.సన్యాసినాయుడు | కాంగ్రెస్ |
| 1959 | టి.సన్యాసినాయుడు | ఇండి |
| 1955(ద్వి) | కుసుమగజపతిరాజు | పిఎస్‌పి |
| | జి.సూర్యనారాయణ | పిఎస్‌పి |

బొత్స అప్పలనర్సయ్య

కొండపల్లి శ్రీనివాస్

డోల శ్రీనివాస్

# పెద్దగెడ్డ నిర్వాసితులపై నిర్లక్ష్యం వరద

- పునరావాస కల్పనకు 21 ఏళ్లుగా మీనమేషాలు
- 18 ఏళ్లు నిండిన వారికి అందని ప్యాకేజీ
- జలదిగ్బంధాల మధ్య పుట్టెడు సమస్యలతో సహవాసం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, పాచిపెంట

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మూడు మండలాల పరిధిలో 12, 220 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో పాచిపెంట మండల కేంద్రానికి సమీపాన 2003లో రూ.4,667లక్షల ప్రారంభ వ్యయంతో తలపెట్టిన పెద్దగెడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి సిఎం చంద్రబాబు శంకు స్థాపన చేశారు. 2006లో సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జలాశయాన్ని ప్రారంభించారు. జలాశయం ఏర్పాటుకు కొటికిపెంట, కేశలి పంచాయతీల పరిధిలోని కోడికాళ్లవలస, మడవలస, తురాయిపాడు, రాళ్లగెడ్డ, ఎగువకుమ్మరివలస, యర్రొడ్లవలస గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. ఈ గ్రామాల పరిధిలోని సుమారు 803 కుటుంబాల వారికి నష్టపరిహారం చెల్లించి, పునరావాసం నిమిత్తం కోడికాళ్లవలస సమీపంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. గృహ నిర్మాణానికి అప్పట్లో కేవలం రూ.55వేలు మాత్రమే ప్రభుత్వం కేటాయించింది.

నిర్మాణాలకు సరిపడా సొమ్ము చెల్లించాలని లేదా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, 18ఏళ్లు నిండినవారికి నష్టపరిహారం చెల్లించాలని నిర్వాసితులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. అప్పట్లో ఎపి నిర్వాసితుల సంఘం ఆధ్వర్యాన బాధితులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. సుమారు 100 మంది నిర్వాసితులు అష్టకష్టాలు పడి చిన్నా చితక ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పటికీ, జలాశయానికి 100 మీటర్ల దూరంలోవున్న కొటికిపెంట, కేసలి పంచాయతీ కేంద్రాలకు చెందిన 570మంది నిర్మించు కోలేక పోయారు. అప్పట్లో 18ఏళ్లు నిండిన యువతీ యువకులుగా పరిహారం కోసం ఎదురు చూసిన వారు, ఆ తరువాత పెళ్లిళ్లు చేసుకుని, పిల్లల్ని కనడంతో వారికి కూడా ప్రస్తుతం ఇళ్ల స్థలాల అవసరమౌతున్నాయి. మరోవైపు 18ఏళ్లు దాటినవారి సంఖ్య ప్రస్తుతం 40నుంచి 100కు పెరిగిపోయింది. వీరంతా పరిహారంతోపాటు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వాలని, లేదంటే ఎలా బతుకుతామని ప్రశ్నిస్తున్నారు.

**సాగునీటి అవసరాల కోసం తరతరాలుగా నమ్ముకున్న పంట భూములు, పుట్టిపెరిగిన గ్రామాలను త్యాగం చేసిన పెద్దగెడ్డ నిర్వాసితులపై అటు టిడిపి, ఇటు వైసిపి ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించాయి. ముంపు గ్రామాలపేరిట అభివృద్ధి పనులు నిలిచిపోవడం, మరోవైపు జలాశయాల నీటి ఊట, విష సర్పాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం మలేరియా, డెంగీ వంటి విష జ్వరాల భారిన పడుతున్నా, తాగునీటికి ఇబ్బంది పడుతున్నా పాలకులకు, ప్రభుత్వానికి కనికరం లేకపోతోందని నిర్వాసిత కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.**

### దోమలు, విష సర్పాలతో సహవాసం

ముఖ్యంగా కొటికిపెంట, కేసలి గ్రామాలు వర్షాకాలంలో నీటిపోటుకు గురౌతునేవున్నాయి. గ్రామాలకు ఆనుకుని నీరువుండడంతో దోమల సమస్యతో నిత్యం డెంగీ, మలేరియా భారినపడుతున్నామని, కష్టమంతా ఆసుపత్రుల్లో వైద్యానికే సరిపోతుందని కొటికిపెంట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిగోడలు నీటిచెమ్మతో వుండడం వల్ల పాములు, తేళ్లు వంటి విష సర్పాలు స్వైరవిహారం చేస్తున్నాయని కేశలి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొటికిపెంటలో శిథిలావస్థకు చేరిన పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు.

తుప్పల్లో ఉన్న నిర్వాసితుల ఇళ్లు

### 20 ఏళ్లయినా పట్టాలు ఇవ్వలేదు

ఇళ్ల నిర్మాణం కోసం భూమి కేటాయించి నేటికీ 20 సంవత్సరాలు అయినప్పటికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదు. ఇళ్ల నిర్మాణాలకు 1,80,000 కేటాయించింది. ప్రస్తుతం ఉన్న సిమెంటు, ఇనుం ధరలు పెరగడం వల్ల ఆ డబ్బులతో ఇళ్ల నిర్మాణం కష్టం. కనీసం రూ.2.50లక్షలు చెల్లించాలి.

**గాదె జానకి రావు, కోటికి పెంట గ్రామం**

### ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదు

రిజర్వాయర్ నిర్మాణంలో సర్వం కోల్పోయాం. భూములు, ఇల్లు ముంపునకు గురయ్యాయి. వయసు సరిపోలేదని ప్రభుత్వం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదు ప్రస్తుతం నాకు 36 సంవత్సరాలు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వానికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఎన్నోసార్లు దరఖాస్తు పెట్టుకున్నప్పటికీ స్పందించలేదు. ప్రస్తుతం సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నాను. **- ఆకుల తిరుపతిరావు, కేసలి గ్రామం**

ఒకటో వార్డులో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

## సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపిస్తే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర చెప్పారు. పట్టణంలోని ఒకటో వార్డులో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని అన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు తాను ఎమ్మెల్యేగా చేసినవేనని చెప్పారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరిస్తానని రాజన్నదొర చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు,వార్డు ఇంఛార్జి రౌతు అప్పారావు పాల్గొన్నారు.

**పది కుటుంబాలు వైసిపిలో చేరిక**

ఒకటో వార్డుకు చెందిన పది టిడిపి కుటుంబాలు వైసిపిలో చేరాయి. డిప్యూటీ సిఎం రాజన్నదొర వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇంఛార్జి రౌతు అప్పారావు నాయకత్వంలో వారు వైసిపి లో చేరారు.

**సాలూరు:** మండలంలోని జీగిరాంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాజన్నదొరకు మరో అవకాశం ఇవ్వాలని, ఎంపి అభ్యర్థి తనూజా రాణితో పాటు రాజన్నదొర గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆమె వెంట మండల జెసిఎస్ కన్వీనర్ కళ్లేపల్లి త్రినాథ్ నాయుడు, సర్పంచ్ అల్లు సూరపునాయుడు, సుభాషిణి, నెలిపర్తి నాయకులు వేణు, నారాయణరావు, డోల పరమేషు పాల్గొన్నారు.

**పాచిపెంట :** మండలంలోని కొటికిపెంట పంచాయతీ కోడి కాళ్ళ వలసలో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ఇప్పలవలసలో వైసిపి ఎన్నికల ప్రచారం**

**సీతానగరం :** మండలంలోని ఇప్పలవలసలో ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి జోగారావు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, నాయకులు చిట్టిరాజు, కొయ్యాన శ్రీవాణి, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గరుగుబిల్లి :** మండలం లో సుంకి, కొంకిడి వరం, సీతారాంపురం, దళయి వలస, ఉద్దవోలు వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అందుకు ప్రజలు గ్రహించి ఓట్లు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి ఉరిటి రామారావు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## నేడు భామినిలో జయకృష్ణ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని లివిరి, దిమ్మిడిజోల, భామిని, బాలేరు పంచాయతీ పరిధిలో పాలకొండ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఎన్నికలు ప్రచారం నిర్వహించనున్నట్లు జనసేన మండలం అధ్యక్షులు రుంకు. కిరణ్, టిడి పి మండలం అధ్యక్షులు బి. రవి నాయుడు తెలిపారు. ఈ ఎన్నికలు ప్రచారంలో మండలంలోని టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున రావాలని కోరారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో జనసేనలో చేరికలు ఉంటాయని తెలిపారు.

## కుటుంబ సభ్యుల ఆస్తులు కాజేసిన కాళ్ల : తవిటిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తల్లిదండ్రుల ఆస్తులను కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా కాజేసిన వ్యక్తి కాళ్ల గౌరీశంకర్ తనపై ఆరోపణలు చేయడం దిగజారుడు తనానికి నిదర్శనమని కార్పొరేటర్ కంటిబుక్త తవిటిరాజు, అవనాపు లక్ష్మణరావు అన్నారు. ఆదివారం నాగవంశం కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాళ్ళ గౌరీశంకర్ మీడియా సమావేశం ద్వారా చేసిన ఆరోపణలను ఖండించారు. ఏ రోజూ కుల సంఘానికి ఉపయోగపడని వ్యక్తికి నీతి నిజాయితీ గురుంచి మాట్లాడే అర్హత లేదన్నారు. సామాజిక భవన నిర్మాణం తాము చేస్తే 16 ఏళ్ల నుంచి సంఘం డబ్బులకు లెక్కలు చెప్పకుండా సొంతంగా వాడుకున్నారని తెలిపారు. సంఘం ఆశయాన్ని నీరుగార్చి అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాను డబ్బులు తీసుకుంటే ఆరోపణలు రుజువు చేసేందుకు సిద్ధమేనా అంటూ సవాల్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్ కనకలనాగవల్లి, నాగవంశం పెద్దలు పాల్గొన్నారు.

## చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు

ప్రజాశక్తి-గజపతినగరం

చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలను నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. టిడిపి వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టోను తొలగించారని అన్నారు. తమ ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టోలో నవరత్నాలను కొనసాగిస్తునే అమ్మఒడి,పింఛను,చేయూత మొత్తాలను పెంచామని వివరించారు. సంక్షేమపాలన కావాలంటే వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# పోలింగు సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సాధారణ ఎన్నికలు నిర్వహణకు సంబంధించి పోలింగు సిబ్బందికి ఎన్నికలు విధులు కేటాయింపునకు రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆదివారం పూర్తి చేశారు. ఈ ప్రక్రియను పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్డ పర్యవేక్షణలో కలెక్టరు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ శోభిక, డిఆర్ఒ జి.కేశవ నాయుడు పాల్గొన్నారు.

**పోలింగు సిబ్బందికి పోస్టలు బ్యాలెట్**

సాధారణ ఎన్నికల్లో పోలింగు విధులకు హాజరగు సిబ్బంది పోస్టలు బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగు అధికారులు, సహాయ పోలింగు అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు మే 5న, పోలీసు సిబ్బంది మే 6న, అత్యవవసర సేవలు, ఇతర శాఖల సిబ్బంది మే 7న పోస్టలు బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. అనివార్య కారణాల వల్ల నిర్దేశించిన రోజుల్లో ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అవకాశం లేని సిబ్బంది మూడు రోజుల్లో ఏదో ఒకరోజు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## సమస్యాత్మక గ్రామంగా 'బైరిపురం'

**మెరకముడిదాం:** మండలంలో ఐదు పంచాయతీలు సమస్యాత్మక గ్రామాలుగా ఉంటే అందులో బైరిపురం కూడా ఉందని చీపురుపల్లి డిఎస్‌పి చక్రవర్తి అన్నారు. ఆదివారం బైరిపురంలో ఆయన ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఊరిలో ఏ గొడవైనా రౌడీ షీట్ ఓపెన్ చేసిన వారినే పిలవాల్సి ఉంటుందని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బుధరాయవలస ఎస్ఐ లోకేశ్వరరావు, అన్ని పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంకితభావంతో సేవలందించా

## ఎఎస్ఐ వివిఎస్ఆర్ శర్మ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

33 ఏళ్లగా పోలీసుగా ప్రజలకు అంకితభావంతో సేవలందించడం జీవితంలో ఎంతో సంతృప్తినిచ్చిందని, ఇది ఒక మరపురాని అవకాశంగా భావిస్తున్నానని స్పెషల్ బ్రాంచ్ ఎఎస్ఐ వివిఎస్ఆర్ శర్మ అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

పార్వతీపురం మండలం, గంగాపురం పంచాయతీ కోరే గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన వడుగూరు ప్రభాకర్ రావు, వెంకట సత్యవతి దంపతులకు ప్రథమ సంతానంగా 1962 ఏప్రిల్ 30న జన్మించాను. ప్రాథమిక విద్య స్వగ్రామంలో సాగగా, 6 నుంచి పదో తరగతి వరకు పెద బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను, ఇంటర్ పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1977లో పూర్తి చేశాను. 1987 మే 17న అన్నపూర్ణతో వివాహమైంది. 1990లో అప్పటి ఉమ్మడి జిల్లా విజయనగరంలో ఆర్మ్ డు రిజర్వు కానిస్టేబుల్‌గా తొలుత ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. సుమారు ఏడేళ్లు ఇక్కడ పనిచేసి విజయనగరంలోనే పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి బదిలీ అయింది. ఇక్కడ ఆరేళ్లు పనిచేసి 2003లో రాజమండ్రి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్‌కు బదిలీపై వెళ్లాను. అప్పట్లో మలేషియాకు తరలిస్తున్న భారీ అక్రమ బియ్యం పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించినందుకు మంచి గుర్తింపునిచ్చింది అన్నారు.

రెండేళ్ల తర్వాత 2005లో సివిల్ కానిస్టేబుల్‌గా నీలకంఠాపురం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యింది. ఏజెన్సీలో పనిచేయడం ద్వారా గిరిజనులకు ఆత్మీయతను పంచుకునేందుకు అవకాశం కలగడం సంతోషాన్నిచ్చింది. 2006లో సీతానగరం మండలానికి బదిలీ అయింది. రూ.2 కోట్లు విలువ చేసే గంజాయిని పట్టుకోవడంలో తాను భాగస్వామి కావడం ఆనందం కలిగింది. ఇక్కడ ఆరేళ్లు పనిచేస్తుండగా హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందుతూ పార్వతీపురం అర్బన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చాను. 2014లో తిరిగి స్పెషల్ బ్రాంచ్ విజయనగరానికి బదిలీ అయినప్పటికీ ఎలీఫెంట్ జోన్ పరిధిలో ఆరున్నరేళ్లుగా పనిచేస్తుండగా 2019లో ఎఎస్ఐగా ఉద్యోగోన్నతి కలిగింది. మళ్లీ 2020లో స్పెషల్ బ్రాంచ్ ఎఎస్ఐగా పార్వతీపురం అర్బన్ స్టేషన్‌కు బదిలీ అయింది. 2022 ఏప్రిల్ జిల్లా పునర్విభజనలో పార్వతీపురం మన్యం జిల్లాకు స్పెషల్ బ్రాంచ్ ఎఎస్ఐగా తిరిగి వచ్చి నేడు ఉద్యోగ విరమణ వరకు విధులను కొనసాగిస్తున్నాను.

నా 33 ఏళ్ల సర్వీసులో అధికారుల వద్ద ఎలాంటి రిమార్కు లేకుండా విధులను నిర్వహించడం, సర్వీస్ కాలంలో అందరితోనూ స్నేహపూర్వకంగా కలిసి కుటుంబ సభ్యుడిగా పలకరింపులతో ప్రజల పిలుపును జీవితాంతం మర్చిపోలేను. ఆగస్టు 15, జనవరి 26 గణతంత్ర దినోత్సవాల్లో 2011 అప్పటి అటవీ శాఖ మంత్రి విజయరామరాజు చేతులు మీదగా, 2017లో కలెక్టర్ వివేక్ యాదవ్, 2018లో ఎస్పీ పాలరాజు, 2022 లో హోంశాఖ మంత్రి తానేటి వనిత, 2024లో రాష్ట్రస్థాయి ఎపి పోలీస్ సేవా పథకం ఎస్‌పి విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ప్రశంసలు, మెడల్స్ ను పొందడం నా సర్వీస్ కాలం మరుపురాని ఘట్టంగా గుర్తుంటుంది. నా పెద్ద కుమారుడు వివిఎస్ సంతోష్ ఫార్మా షుట్కల్ కంపెనీ కోహన్స్ లైఫ్ సైన్సెస్ మేనేజర్ గా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు వివి జ్ఞానేంద్రశర్మ చార్టెడ్ అకౌంటెంట్‌గా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నాడు. కుటుంబ సభ్యులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో సఫలీకృతం అవ్వడం సంతోషాన్నిచ్చింది. భార్య అన్నపూర్ణ అనుక్షణం తన విధులకు సహకరించి తోడ్పాటు అందించడం ఆనందాన్నిచ్చింది. ఉద్యోగ విరమణ అనంతరం వ్యవసాయ కుటుంబంలో వచ్చిన మొదటి గురువు తన తండ్రే అని, తన అభిరుచిలో భాగంగా వ్యవసాయం చేయడంలో సంతోషం కలుగుతుందన్నారు. తమ శేష జీవితాన్ని సామాజిక సేవలో గడపాలని సంకల్పిస్తున్నానని అన్నారు.

# కొత్తవలసలో టిడిపి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కొత్తవలస, చెల్లంనాయుడు వలసలో ఆదివారం పార్వతీపురం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తుందన్నారు. సూపర్ సిక్స్ గ్యారంటీలను అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యనారాయణ, రౌతు వేణుగోపాలనాయుడు. బి.శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వీరఘట్టం** : రానున్న సాధారణ ఎన్నికల్లో జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణను గెలిపించాలని కోరుతూ మండలంలోని అచ్చప వలస గిరిజన గ్రామంలో పట్టణ టిడిపి అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ ఆదివారం ప్రచారం చేశారు. ముందుగా గ్రామంలో పర్యటించారు. అనంతరం గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తనను గెలిపిస్తే గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని గిరిజనులకు భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు నిమ్మక జయ కృష్ణకు వేసి గెలిపించాలని గిరిజనులను కోరారు. కార్యక్రమంలో బల్ల హరిబాబు, పి మహేష్ , రాయిపల్లి రత్నాకర్ తోపాటు గిరిజనులు పాల్గొన్నారు.

**మొండింఖల్ లో టిడిపి ప్రచారం**

**కురుపాం :** మండలంలోని మొండెంఖల్ పంచాయతీలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి టి.జగదీశ్వరి , రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్ర దేవ్ ఆదివారం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమకు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్వతీపురం : కొత్తవలసలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి విజయచంద్ర

# లబ్ధిదారుల చెంతకు చేరని టిడ్కో ఇళ్లు

## పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో పేదలకు కేటాయించిన టిడ్కో ఇళ్లు వైసిపి ఐదేళ్లపాలనలో వారి చెంత చేరలేదు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పేదల ఇళ్ల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించారని బాధితులు వాపోతున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టి ఇవ్వాలనే లక్ష్యంతో టిడ్కో ఇళ్ల నిర్మాయణం చేపట్టారు. బ్యాంక్ రుణాల ద్వారా టిట్కో ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు 300 చదరపు అడుగులకు రూ.5వేల రూపాయలు, 365 చదరపు అడుగులకు రూ.25వేలు, 430 చదరపు అడుగులకు 50 వేల రూపాయలు మునిసిపల్ కార్యాలయం పేరున ఉన్న బ్యాంక్ ఖాతాకు సంబంధిత లబ్ధిదారులు బ్యాంకులో చెల్లించారు. అయితే లబ్ధిదారులకు నిర్మించాల్సిన ఇళ్లకు కావలసిన భూసేకరణను టిడిపి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చేయలేదు. అరకొరగా సేకరించిన స్థలంలో నిర్మించిన ఇళ్లు 25శాతం మాత్రమే పూర్తయ్యాయి.

2019లో అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం సంబంధిత కాంట్రాక్టర్ నుండి ఆ పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించింది.అంతే కాకుండా రూ.56కోట్లతో పట్టణంలోని ఇళ్లు లేని 786 మంది లబ్ధిదారులకు 300 చదరపు అడుగులు విస్తీర్ణంలో ఒక్క రూపాయికే టిట్కో ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు అడ్డాపుశీల గ్రామం వద్ద 16 బ్లాకులలో నిర్మాణాలు చేపట్టారు. 5ఏళు కావస్తున్నా నిర్మాణాలను పూర్తి చేశారు. భవన నిర్మాణాలు పూర్తయినా ఇళ్ల లోపల పనులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు అంతంత మాత్రంగా జరుగుతున్నాయి గృహ సముదాయాలకు వెళ్లేందుకు సిసి రోడ్లు, వాడుక నీరు వెళ్లేందుకు కాలువలు, విద్యుత్తు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాల పనులు పూర్తికాలేదు . గత ఏడాది ఉగాది నాటికి లబ్ధిదారులందరికీ అప్పగిస్తామని చెప్పి ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మున్సిపల్ అధికారులు కూడా పూర్తి చేశారు కానీ ఈ ఏడాది ఉగాది నాటికి కూడా లబ్ధిదారులకు అందజేయలేదు.. ఇంతవరకు ఎనిమిది బ్లాకులకు పెయింటింగ్ పనులు పూర్తి చేశారు, మిగిలిన ఏడు బ్లాకులకు పెయింటింగ్ పనులు జరగలేదు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఈ పనులు నిలిచిపోయాయి. సొంతగూడులో తలదాచుకుందామని ఆశించినపేదలకు ఐదేళ్లుగా ఎదురు చూపులే మిగిలాయి. ఇంకా ఎన్నాళు పడుతుందోనని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

రంగులు వేసిన ఉన్న కొన్ని బ్లాకులు

### ఐదేళ్ల క్రితం అప్పులు చేసి కట్టాం

ఇళ్ల కోసం రూ. 2కోట్ల 34లక్షల ను ప్రభుత్వానికి కట్టిన 624 మంది లబ్ధిదా రులు తమ డబ్బులు ఎప్పుడు అందుతాయని ఎదురుచూస్తూ, తమ డబ్బులు తిరిగి ఇచ్చేయాలంటూ పలుమార్లు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగు తున్నారు. కానీ కట్టిన డబ్బులు తిరిగి చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్‌ను వివరణ కోరగా , లబ్ధిదారులు చెల్లించిన నగదును టిట్కో పిడి అకౌంట్‌కు ట్రాన్స్ ఫర్ చేశామని తెలిపారు. లబ్ధిదారులు చెల్లించే నగదును తిరిగి చెల్లించాలని లెటర్ కూడా పెట్టామని నగదు వచ్చిన వెంటనే లబ్ధిదారులకు చెల్లిస్తామని తెలిపారు.

### కోడ్ నేపథ్యంలో పంపిణీ జరగలేదు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పంపిణీ జరగలేదు. త్వరలోనే గృహ సముదాయాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తాం.

**జ్యోతి, టిడ్కో ఇఇ**
**పార్వతీపురం**

కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శోబిక, ఎఎస్‌పి సునీల్ షరోన్

## కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ ఎస్ శోబిక ఆదివారం పరిశీలించారు. ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి అరకు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకు ఉద్యాన కళాశాలలో ఏర్పాట్లను చేస్తున్నారు. స్ట్రాంగ్ రూం లను, ఓట్ల లెక్కింపు గదులను, కంట్రోల్ రూం, మీడియాసెంటర్, ఏర్పాటు చేయాల్సిన వివిధ విభాగాలను నిశితంగా పరిశీలించారు. వివిధ శాఖలకు కేటాయించిన పనుల పురోగతిని సమీక్షించారు. రెవెన్యూ, పోలీసు, రోడ్లు భవనాలు, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖల అధికారులకు వారికి అప్పగించిన పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి సునీల్ షరోన్, డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, పార్వతీపురం, కురుపాం ఆర్‌డిఒలు కె.హేమలత, వి.వెంకట రమణ, డిపిఒ బి.సత్యనారాయణ, ఆర్అండ్‌బి అధికారి ఎస్ వేణుగోపాలరావు, ఇపిడిసిఎల్ పి.త్రినాథరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కనిపించడం లేదా?

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఎన్నికల కమిషన్ కఠినమైన నిబంధనలు తీసు కొచ్చినప్పటికీ నిబంధనల ప్రకారం ప్రచారంలో పాటించడం ఆచరణలో కానరావడం లేదు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు పార్టీ జెండాలు కట్టి ఉన్న విషయం ఎంసిఎంసి బృందం ఉదాసీనంగా ఉండడం ఆశ్చర్యమని పలువురు ముచ్చటిం చు కుంటున్నారు.

సుంకిలో ని విద్యుత్ స్తంభాలకు ఉన్న వైసిపి జెండాలు

## టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని చింతాడకు చెందిన 20కుటుంబాలు మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన తుమ్మలపల్లి అప్పలనాయుడు, తుమ్మలపల్లి పకీరునాయుడు, గొంటేల రామకష్ణ, నాగభూషణరావు, పోరెడ్డి రాంబాబు, తదితరులు చేరారు. వీరికి రామినాయుడు పార్టీ కండువా వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వంజరాపు ఈశ్వరరావు, కోట సంగంనాయుడు, శాశపు గోవిందరావు, శాసపు నవీన్, లావేటి రాజశేఖరం, శివ్వాల శ్రీధర్ , మిడితాన కనకంనాయుడు, మాచర్ల శ్రీను, మిడతాన హరిబాబు నాయుడు, సవిరిగాన రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### పలువురు జనసేనలో చేరిక

మండలంలోని ఎల్ఎల్ పురం పంచాయతీ చంద్రయ్య వలస గ్రామనకి చెందిన నిమ్మక సురేష్, కూరంగి నూకరాజు, కూరంగి హేమంత్, తోరిక మధుతో పాటు 10 కుటుంబాలకు చెందిన ప్రతినిధులు ఉమ్మడి పార్టీల జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కొత్తగూడలో ప్రచారం చేపట్టారు కూటమి మేనిఫెస్టో గురించి వివరించారు. గ్లాస్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీతంపేట మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గొట్టుముక్కల కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు నిమ్మక నాగేశ్వరావు, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, సవర సోడంగి, మహాశక్తి ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కురుపాం:** మండలంలోని కిచ్చాడ పంచాయతీ రామకృష్ణాపురం నుంచి వైసిపికి చెందిన 14 కుటుంబాలు ఆదివారం కురుపాం కోటలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్ర దేవ్ ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వీరేష్ వారికి టిడిపి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కిచ్చాడ టిడిపి నాయకులు పడాల శ్రీనివాసరావు, డొల్ల కిషోర్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, చందక రామకృష్ణ, సువ్వాన గోవింద తదితరులు పాల్గొన్నారు.

## తమ్ముడికి తోడుగా అన్న ప్రచారం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని మూలలంక, గాదిలంక, గోర కాలనీ తదితర గ్రామాల్లో ఆదివారం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అన్న, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ గ్రామాల్లో ముమ్మరంగా ప్రచార కార్యక్రమం చేపట్టారు. గ్లాసు గుర్తుకు ఓటు వేసి జయకృష్ణకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మూలలంక సర్పంచ్ బిడ్డిక కమలమ్మ, సర్పంచ్ ప్రతినిధి సూర్యం, సోమేశ్వరరావు, తదితర 65 కఁటుంబాలు మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు మాచర్ల అనిల్ బాబు, కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, అలజంగి కృష్ణ, జనసేన నాయకులు జనసేన జానీ, ఆర్.కృష్ణంనాయుడు, జి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కళావతి

## ఘనంగా డొక్కా సీతమ్మ వర్థంతి

ప్రజాశక్తి - బలిజిపేట

ఆంధ్రుల అన్నపూర్ణగా ప్రజల హృదయాల్లో స్థానం పొందిన డొక్కా సీతమ్మ వర్థంతిని మండలంలోని పెదపెంకిలో ఆదివారం నేతాజీ గ్రంధాలయం స్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యంలో ఆ గ్రామ యువత ఘనంగా నిర్వహించారు. తొలుత సీతమ్మ చిత్రపటానికి సంజీవనాయుడు భార్య కళావతి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో యువజన నాయకులు కర్రి సతీష్, పెనుబోతు భాస్కర్ రావు, గొర్లె శ్రావణ్ కుమార్, ఆర్ఎంపి డాక్టర్ శ్రీను, ముక్కు సాయి, దత్తి సత్యనారాయణ, ఎన్.సత్యారావు, ఈర్ల సింహాచలం, టి.పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వేసవి శిక్షణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న వేసవి విజ్ఞాన శిబిరానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జూన్ 11 వరకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ముందుగా సంబంధిత పాఠశాలల ప్రధానో పాధ్యాయులను కలిసి గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థులకు కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, ఆటల పోటీలు, తదితర కార్యక్రమాలను ప్రతిరోజు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈమేరకు విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఓటర్ల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సహాయ ఎన్నికల అధికారి, తహశీల్దార్ కె.జయప్రకాష్ బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూతు లెవెల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓటరు స్లిప్పులు పంపిణీ కార్యక్రమంలో ఎటువంటి అలసత్వానికి గురికాకుండా ప్రతి ఓటరుకు స్లిప్పు అందేలా చూడాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో బూతు లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

## పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు వేసవి సెలవులు కావడంతో ఎండలు తీవ్రంగా ఉండడంతో వేసవి విడిది కోసం పర్యాటకులు జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేసి, స్కై సైకిల్‌కు ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు మినీ ట్రైన్ ఆడుతున్నారు. పిల్లలు, వృద్ధులు కాసేపు పార్కులో సేద తీర్చుకున్నారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాలో ఊగారు. అనంతరం ఆనంద విహార్ వద్ద ఉత్సాహంగా, ఉల్లాసంగా డాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

పార్కులో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

# అకౌంట్లలోకే పింఛను డబ్బులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల మోడల్ కోడ్ అమలులోఉన్న కారణంగా మే, జూన్ నెలలో పెన్షన్ పంపిణీకి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన విధి విధానాల ప్రకారం పెన్షన్లు పంపిణీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు, తీవ్ర అనారోగ్యం తో ఉన్నవారు, చక్రాలకుర్చీకు పరిమితమైనవారు, సైనిక్ వెల్ఫేర్ పెన్షన్లను ఇంటింటికి సచివాలయం సిబ్బంది 1 వ తారీఖు నుంచి అందచేస్తారని తెలిపారు. మిగతా వారికి డిబిటి విధానం ద్వారా వారి అకాంట్‌లకు 1వ తేదీన పెన్షన్ మొత్తంజమ చేస్తారని తెలిపారు. ఇంటింటికి పెన్షన్ ఇచ్చే వారి వివరాలు, డిబిటి ద్వారా పెన్షన్ జమచేసే వారి వివరాలు సచివాలయంలో ఉంచుతారని తెలిపారు. పెన్షన్ తీసుకోవడానికి ఎవ్వరూ కూడా సచివాలయాలకు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం లేదన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ పెదవీర్రాజు

# అందుబాటులో ఆధునిక గ్యాస్ట్రో వైద్య సేవలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పేద, మధ్య తరగతి ప్రజలందరికీ అందుబాటులో నాణ్యమైన అత్యాధునిక గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా చేతన్ గ్యాస్ట్రో లివర్ సెంటర్ ఏర్పాటైందని పలువురు అన్నారు. కంటోన్మెంట్‌లో డాక్టర్ ఐ.నరేష్‌కుమార్ ఆధ్వర్యాన నిర్మించిన చేతన్ గ్యాస్ట్రో లివర్ సెంటర్‌ను ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ ఎమ్‌డి ఇ.పెదవీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ అన్ని రకాల జీర్ణకోశ వ్యాధులకు అధునాతన వైద్య సేవలు ఇక్కడ లభిస్తాయన్నారు. అలాగే లాపరోస్కోపీ, జీర్ణ కోశ కేన్సర్ సర్జరీ చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఎండోస్కోపీ, కొలనోస్కోపి, ఇఆర్‌సిపి, లివర్ సిర్రోసిస్, హెపటైటిస్ బి, సి, ప్యాంక్రియాటిక్ వ్యాధులకు చికిత్స నిర్వహిస్తామన్నారు. ఇక్కడ అధునాతన ఐసియు, అంబులెన్స్ సౌకర్యం ఉందన్నారు. కాబట్టి జిల్లా ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి అదితి

# అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం విజయనగరంలో డాక్టర్. పివిజి. రాజు కళ్యాణ మండపంలో కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన లాండ్ టైటిలింగ్ యాక్ట్ వలన రిజిస్ట్రేషన్ ఒరిజినల్ పత్రాలు వారి పేరు మీద ఉంటాయన్నారు, మనకు కేవలం జిరాక్స్ మాత్రమే ఇస్తారన్నారు, దీనివలన మీరు కోర్టుకు వెళ్లినా హక్కు ఉండేదన్నారు, 1బి రికార్డులు కూడా వీరు తారుమారు చేస్తున్నారన్నారు.వైసిపి హయాంలో విపరీతంగా ధరలు, పన్నులు పెరిగాయని అన్నారు. నియోజకవర్గం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు తదతరులు పాల్గొన్నారు.

ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

# జనసేనకు ఓటేస్తే నిరుపయోగం

## ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి- భోగాపురం

ఎక్కడో అమెరికాలో ఉండి వచ్చేవారికి ఓటు వేసి గెలిపించినా ఉపయోగం లేదని ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. చిన్నారులు కూలికి వెళ్లకుండా పాఠశాలకు వెళ్లాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమ్మ ఒడి అనే పథకాన్ని ప్రవేశపెట్టారని, తాజా మేనిఫెస్టోలో ఆ మొత్తాన్ని రూ.17వేలకు పెంచారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. మండలంలో ఆదివారం మండల వైసిపి అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. లింగాలవలస, మరడపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో కొండపు కొత్తయ్యరెడ్డి, చెరుకుపల్లి పంచాయతీలో రిక్క అప్పల నరసయ్య, గుడివాడ పంచాయతీలో దాసరి చంద్రశేఖర్ రెడ్డి, రాజాపులోవ పంచాయతీలో కిలారి వెంకటరమణ ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తను మరోసారి గెలిపించాలని ఆయన అన్నారు. ఇప్పటికే నియోజకవర్గ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మరడపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీకి ప్రత్యేక ప్యాకేజి వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు నెక్కల నాయుడు బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యేను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, కొండపు కొత్తయ్య రెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయం నిర్వాసితులకు ప్రభుత్వం ఎంతో మేలు చేసి మంచి కాలనీ నిర్మించిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కందుల రఘుబాబు, ఉప్పాడ శివారెడ్డి, పడాల శ్రీనివాసరావు, భాను, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, యర్రప్పల నారాయణ, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, కొల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొ న్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

# అన్నివర్గాలకూ మేలుచేసే మేనిఫెస్టో

## మే 1 న బొబ్బిలిలో బహిరంగ సభకు సిఎం జగన్

## వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నవరత్నాలు కొనసాగిస్తూనే మరి కొన్నిటిని అదనగా చేర్చి అన్ని వర్గాలు ప్రజలకు మేలు చేసే విధంగా ఎన్నికల మేనిఫెస్టో ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ధర్మపురిలోని తమ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు మేలు చేకూర్చే ఆలోచనతో గత నవరత్నాలు కొనసాగిస్తూనే మరి కొన్ని కొత్త అంశాలు పొందుపర్చినట్లు తెలిపారు.ఉద్యోగ, ఉపాధి, ఆరోగ్యం, విద్య ప్రాధాన్యత పెంచే విధంగా కృషి చేస్తున్నామన్నారు. రానున్న ప్రభుత్వం ద్వారా 175 నియోజకవర్గాల్లో స్కిల్ కేంద్రాలు పెట్టి యువతకు నైపుణ్యం పెంచి ఉపాధి అవకాశాలు పెంచనున్నట్లు తెలిపారు. మహిళలను మరింత ఆర్థికంగా అభివద్ధి చెందాలని దష్టితో పొదుపు మహిళలకు ఎటువంటి వడ్డీ లేకుండా మూడు లక్షలు వరకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

చంద్రబాబు లాంటి అబద్ధపు హామీలు తాము ఇవ్వడం లేదన్నారు.గతంలో ఆయన ఇచ్చిన హామీలును సగం కూడానెరవేర్చలేకపోయారన్నారు. మూడు రాజధానులకు కట్టుబడిఉన్నట్లు తెలిపారు. వైసిపి అభ్యర్థులకు ఓటు వేసి రాష్ట్ర అభివృద్ధికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 1 తేదిన బొబ్బిలిలో జరగనున్న బహిరంగ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ పెనుమత్స. సురేష్ బాబు, నాయకులు కెవి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

# గ్రామాల్లో 'కోళ్ల' ప్రచారం

ప్రజాశక్తి - జామి, వేపాడ

మండలంలోని అలమండ, జాగారం గ్రామాలలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాణి, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడగానే సంక్షేమ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

**వేపాడ** : మండలంలోని బోజంకివానిపాలెం, చిన్న గుడిపాల, వేచలపూడి, జమ్మాదేవి పేట, ఎన్‌కెఆర్‌పురం, పెదగుడిపాల, భరతవాణిపాలెం గ్రామాల్లో ఆదివారం టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎమ్‌పిగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పి అభ్యర్థి శ్రీభరత్ పెద్దమ్మ బైరపనేని శ్రీనాగి, నాయకులు గుమ్మడి భారతి, పి రమణ, రమణమూర్తి, ఇందుకూరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి లలితకుమారి, నాయకులు

ప్రచారంలో మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

# ఒక్కసారి అవకాశమివ్వండి

## జనసేన అభ్యర్థి మాధవి

ప్రజాశక్తి - భోగాపురం

ఒక్కసారి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని కూటమి అభ్యర్థి లోకం మాధవి అన్నారు. మండలంలోని నందిగాం, తీరప్రాంత గ్రామాలైన పెద్దకొండరాజుపాలెం, ముక్కాం పంచాయతీలతో పాటు రాజాపులోవ, లింగాలవలస, పోలిపల్లి గ్రామాలలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన మత్స్యకారులను అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే తీరుతో నియోజకవర్గం వెనుకబడి ఉందని, ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ మళ్లీ వైసిపికి ఓటు వేస్తే రాష్ట్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లుబోయిన నర్సింగరావు, గూడెపువలస సర్పంచ్ మట్ట అయ్యప్ప రెడ్డి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, సూర్య తేజ మాస్టర్, కర్రోతు శ్రీనివాసరావు, ఎంపిటిసి గనగళ్ల బాబాజీ, నాయకులు బడినాయుడు, ఉపసర్పంచ్ మైలపల్లి మసీను, కోలా గురువులు, మైలపల్లి అప్పలకొండ, డిఎల్ రెడ్డి, ముంజేరు ఎంపిటిసి పిడుగు వెంకటసత్యం, పల్లా రాంబాబు, పల్లంట్ల జగదీశ్, సీతం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**జనసేనలో పలువురు చేరిక**

మండలంలోని ఏ. రావివలస, కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఏ. రావివలస బిఎస్‌పి పార్టీ మాజీ కోఆర్డినేటర్ కోరాడ వెంకటరమణ, సురేష్, దల్లి శ్రీను, బోర రెడ్డి, జీరు రాంబాబు, కొయ్య రాంబాబు తదితరులతో పాటు కొండ్రాజుపాలెం నుంచి సుమారు 50 కుటుంబాలు పార్టీలో చేరాయి.